# వృద్ధజీవి

( నాగేశ్వరరావు )

[ప్రకృతిలో వింతప్రవర్తులుగల మానవు లెందరో వున్నారు. వారి నిత్యైనందిన జీవితమే ఇందులో చిత్రిస్తున్నాడు కథకుడు. ఇక చదువండి.]

అతడొక విద్యార్థి...విజ్ఞానసంపాదన కోసం వందలు, వందలు వెచ్చించడంకోసం సిద్ధముగావున్న చదువరి. ఆలోచన ఒకటైనా ఆచరణ మరోటైయింది...

కారణం ఏమంటారు ?

అతని సహవాసమే...సహవాస దోషంవల్లనే అతని విజ్ఞానం నాశనంఅయింది... అతడి పిత్రార్జితం చట్టబండలైంది...అతడి బుద్ధికుశలత సర్వనాశనం అయింది-ధూర్తుల సహవాసంవల్ల శరీరం గుల్లబారపోయింది... అయినా అతడిబుద్ధిమారలేదు...తండ్రి కష్టార్జితమంతా త్రాగుడుకు ధారపోసి తందనాలాడుతూ స్నేహబృందంతో స్వేచ్ఛాజీవనము సాగిస్తున్నాడు...

పాపం! ఆతల్లిదండ్రులు తమ కుమారునకై, సర్వస్వమూ వెచ్చించి అతడే నాథుడని నమ్ముకుని అతడికోసం తమధనాన్ని... తమ మర్యాదని...తుదకు తమ జీవితాన్ని కూడా బలిదానం చేయసమకట్టుతున్నారంటే అది ఎవరికోసం...?

విలాసపురుషుడై ఆవిద్యార్థి విద్యకు స్వస్తిచెప్పి అవిద్యాకారణంవల్ల అవివేకుడై నేటిసుఖమే, సౌఖ్యతరమని విర్రవీగి జీవితకాలం వుళ్ళబుచ్చుతూన్న అపాత్రుడు.... కొడుకు ధనార్జనపరుడై తమ్ము పోషిస్తాడనే ఉద్దేశంతోనే తమ సర్వస్వమూ ధారపోసి పేదబికారులయేరా తల్లిదండ్రులు వార్ధక్యం ఆవరించింది....ఓపిక సన్నగిల్లింది...ఆవిద్యార్థి చదువు పూర్తిఅయింది...అతనికి విద్యా లేదూ..., అతని తల్లిదండ్రులకు ధనమూ లేదు...

ఇప్పుడు వారు దరిద్రులు...దారిద్ర్యం వారిజీవితాలను నలిపి, నలిపి నాశనం చేస్తున్నాది. ఈ భీకరప్రళయదారిద్ర్యానికి వారి జీవితములు అర్పించడమా ? లేక కుమారుని దుష్క్రియాప్రవృత్తికి దుఃఖించడమా ? ఏది కర్తవ్యం ?

పాపం ? ఆ వృద్ధజీవాలు ఆ విచారంతోనే మంచమెక్కి తమ కుమారుని అవినీతి కార్యకలాపానికి తమ ప్రాణాలను బలిదానం చేసారు....

ఇప్పుడతడొక యేకాకి...జీవనవిధానానికి మార్గం కనిపించలేదు... ఆలోచనారహితుడై...ఆర్తానుడై..., పూర్వస్నేహితులను ఆశ్రయించేడు...ఆదరణలేక అలమటించిపోయి పస్తులుపడుకున్నాడు....

కాలం గిర్రున తిరిగింది...

దీన్ని లోకప్రవృత్తి అంటారా....?

లేక......?